క్లుప్తంగా

వక్ఫ్ బోర్డు ఆస్తులను కాపాడండి


సయ్యద్ నూరుద్దీన్

తాటిచెట్లపాలెం: రాష్ట్ర వ్యాప్తంగా వక్ఫ్ బోర్డు ఆస్తులను కాపాడాలని ముస్లిం రైట్స్ అండ్ వెల్ఫేర్ వ్యవస్థాపక అధ్యక్షుడు సయ్యద్ నూరుద్దీన్ ముఖ్యమంత్రిని కోరారు. ఇటీవల పెందుర్తి నియోజకవర్గ పరిధిలో తాను పర్యటించానని, ఈ ప్రాంతంలో సర్వే నంబర్ 1 నుంచి 539లో గల సయ్యద్ అలి ఇషాక్ మదని వారి దర్గాకు చెందిన కొన్ని వందల ఎకరాలు ముస్లిం మైనార్టీలకు చెందిన వక్ఫ్ భూములు ఉన్నాయని, వీటిలో ఎక్కువ భాగం కబ్జాకు గురై అన్యాకాంత్రం అయ్యాయని తెలిపారు. ఇందులో కొందరు రాజకీయ నాయకులు, అధికారులు కూడా ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ భూములను ఆక్రమించిన వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. త్వరలోనే జిల్లాలోని స్థానిక మత పెద్దలు, మేధావులు, స్థానిక ముస్లింలతో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

ఘనంగా పరదేశమ్మ వార్షికోత్సవం


పూజల్లో పాల్గొన్న ఆళ్ల శివగణేష్

తాటిచెట్లపాలెం: రైల్వేన్యూకాలనీ, తాటిచెట్లపాలెం ప్రాంతంలోని పరదేశమ్మ వారి 21వ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఏపీ హ్యాండీ క్రాఫ్ట్ వెల్ఫేర్, డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ ఆళ్ల శివ గణేష్ పాల్గొన్నారు. ఉదయం 9గంటల నుంచి గణపతిపూజ, పుణ్యాహవచనం, పంచగవ్య అంకురార్పణ, శాంతి మండపారాధన, సుగంధ ద్రవ్యాలతో 108 కలశారాధన, గ్రామ ప్రదక్షిణ, అభిషేకం, సహస్ర కుంకుమార్చన, కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు అనిల్ భవాని ఆధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. 18వ తేదీన మహాశివరాత్రి సందర్భంగా రాత్రి 9 గంటల నుంచి మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మార్చి 7వ తేదీన భారీ అన్నదానం కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి పూజలు


అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

సీతంపేట: స్థానిక గణేష్ నగర్‌లోని పార్వతీశ్వరాలయంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి, నాగబంధానికి విశేష పూజలు నిర్వహించారు. మాఘమాసం, మంగళవారం కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించి పంచామృతాభిషేకం, క్షీరాభిషేకం, గంధ, విభూది, పండ్ల రసాలతో స్వామికి అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకులు శివాజీశర్మ, భాస్కరశర్మ మంత్రోచ్ఛరణలతో స్వామికి ధూప దీప నైవేద్యం సమర్పించారు. అనంతరం స్వామిని పూల దండలతో చూడముచ్చటగా అలంకరించి హారతులిచ్చారు.

19న కళా తపస్వి 93వ జయంతి వేడుకలు

మద్దిలపాలెం: కళా తపస్వి కె.విశ్వనాథ్ 93వ జయంతి వేడుకలను వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెల 19న సాయంత్రం 5 గంటలకు విశాఖ పౌర గ్రంథాలయంలో నిర్వహించనున్నామని సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు తెలిపారు. సీనియర్ దర్శకుడు, సినిమాటోగ్రాఫర్ ఎం.వి.రఘు ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారని పేర్కొన్నారు. అనంతరం స్వాతిముత్యం చిత్రాన్ని ప్రదర్శిస్తామన్నారు. పూర్తి వివరాలకు 94415 71581 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

జోరుగా అభివృద్ధి పనులు

- రూ.7లక్షలతో శ్రీనివాసనగర్‌లోని చిల్డ్రన్ పార్క్ అభివృద్ధి
- గోళీల పాలెంలో 30 లక్షలతో సీసీ డ్రెయిన్లు, రోడ్లు
- రూ. 20లక్షలతో వెంకటేశ్వరకాలనీలో సామాజిక భవనం
- శ్రీనివాసనగర్‌లో వంతెన నిర్మాణానికి రూ.33 లక్షలు మంజూరు


డ్రెయిన్ నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ ఉషశ్రీ


నందగిరినగర్‌లో నిర్మిస్తున్న డ్రెయిన్

సీతంపేట: జీవీఎంసీ 43వ వార్డులో అభివృద్ధి పనులు జోరుగా జరుగుతున్నాయి. వార్డు కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ చొరవతో వార్డులో పలు ప్రాంతాల్లో ప్రజల వినతి మేరకు మౌలిక వసతులు కల్పిస్తున్నారు. జీవీఎంసీ మంజూరు చేసిన నిధులతో సీసీ డ్రెయిన్లు, రోడ్లు, సామాజిక భవన నిర్మాణ పనులు జరుగుతుండగా, ప్రజల రాకపోకలకు వీలుగా శ్రీనివాసనగర్ వంతెన నిర్మాణ పనుల కోసం నిధులు మంజూరయ్యాయి.

చిల్డ్రన్ పార్కు పునరుద్ధరణ....

శ్రీనివాసనగర్‌లో గెడ్డ పక్కన అధ్వానంగా ఉన్న చిల్డ్రన్ పార్కును సుమారు రూ.7 లక్షలతో పార్కును పునరుద్ధించారు. పిల్లలు ఆడుకోవడానికి ఆట పరికరాలు, పెద్దల కోసం ఓపెన్ జిమ్, కూర్చోడానికి సిమ్మెంట్ బెంచీలు ఏర్పాటు చేశారు. అలాగే పార్కులోని గోడలను వాల్ ఆర్ట్ పెయింటింగ్‌తో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు.

సీసీ డ్రెయిన్లు, రోడ్లు

గోళీలపాలెంలో రూ.30 లక్షలతో సీసీ డ్రెయిన్లు, రోడ్లు నిర్మించారు. నందగిరినగర్‌లో పాడైన డ్రెయిన్ల స్థానంలో సుమారు రూ. 22 లక్షలతో సీసీ డ్రెయిన్లు నిర్మిస్తున్నారు. పాత డ్రెయిన్ల కంటే వెడల్పుగా నిర్మిస్తున్నారు. అలాగే రూ.12 లక్షలతో సీసీ రోడ్లు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. వెంకటేశ్వర కాలనీలో రూ.20 లక్షలతో సామాజిక భవనం నిర్మిస్తున్నారు.

వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు

80 అడుగుల రోడ్డు నుంచి శ్రీనివాసనగర్‌లోకి సరైన రోడ్ కనెక్టవిటీ లేక చాలా కాలంగా నివాసితులు ఇబ్బంది పడుతున్నారు. శ్రీనివాసనగర్‌లోని ద్విచక్రవాహనాలు, ఆటోలు తప్ప కార్లు, వచ్చే మార్గం లేదు. అత్యవసర పరిస్థితులో అంబులెన్స్ సైతం వచ్చే మార్గం లేక స్థానికులు ఏళ్ల తరబడి ఇబ్బంది పడుతున్నారు. శ్రీనివాసనగర్ గెడ్డపై ఉన్న వంతెన విస్తరణ చేపట్టి వాహనాల రాకపోకలకు మార్గం కల్పించాలని చాలా కాలంగా స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. గత ప్రభుత్వాలు పలుమార్లు పరిశీలించి హామీలు ఇచ్చాయే తప్ప కార్యరూపం దాల్చలేదు. ప్రస్తుత 43వ వార్డు కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లారు. పట్టుదలతో వంతెన నిర్మాణానికి రూ.33 లక్షలు మంజూరు చేయించారు. ప్రస్తుతం టెండర్ దశ పూర్తయి అగ్రిమెంట్ దశలో ఉంది. త్వరలో వంతెన పనులు ప్రారంభం కానున్నాయి. వంతెన నిర్మాణం పూర్తయితే శ్రీనివాసనగర్ ప్రాంతవాసుల కష్టాలు తీరినట్టే.


పార్కులో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్, ఆట పరికరాలు

మౌలిక సదుపాయాలపై దృష్టి



వార్డులోని ప్రజల అవసరాలకు తగినట్టు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. జీవీఎంసీ 43వ వార్డులో సుమారు కోటిన్నర విలువైన అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. చిల్డ్రన్ పార్కు అభివృద్ధి చేసి , ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశాం. నందగిరినగర్, శ్రీనివాసనగర్, గోళీలపాలెంలో సీసీ డ్రెయిన్లు, రోడ్లు , వెంకటేశ్వరకాలనీలో సామాజిక భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. శ్రీనివాసనగర్ ప్రాంతవాసుల కష్టాలు తీరేలా వంతెన నిర్మాణానికి రూ.33 లక్షల నిధులు మంజూరయ్యాయి. త్వరలో పనులు ప్రారంభం కానున్నాయి.

–పెద్దిశెట్టి ఉషశ్రీ, కార్పొరేటర్, 43వ వార్డు

అభ్యసనా సామర్థ్యాలు పెంపొందించాలి

డీఈవో చంద్రకళ


విద్యార్థుల వర్కు పుస్తకాలు పరిశీలిస్తున్న డీఈవో చంద్రకళ

మురళీనగర్: విద్యార్థుల్లో కనీస సామర్థ్యాల సాధనకు ఉపాధ్యాయులు కృషి చేయాలని విశాఖ జిల్లా విద్యాశాఖాధికారిణి ఎల్.చంద్రకళ ఆదేశించారు. మాధవధారలోని జీవీఎంసీ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను డైట్ అధ్యాపకుడు గొట్టేటి రవితో కలిసి ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థుల్లో చదవడం, రాయడంతోపాటు, గణితంలో చతుర్విద ప్రక్రియలు సాధించాలన్నారు. ఒకటి, రెండో తరగతి విద్యార్థుల పఠణ సామర్థ్యాన్ని ఆమె పరిశీలించి ప్రశంసించారు. నాలుగు, ఐదు తరగతుల్లో విద్యార్థులు సామర్థ్యాల సాధనలో వెనుకబడి ఉన్నారని దీనిపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. వర్కు బుక్స్, నోట్స్ పరిశీలించిన ఆమె పెండింగ్‌లో ఉన్న వాటిని రెండు రోజుల్లో పూర్తి చేయాలని సూచించారు. 8వ తరగతి విద్యార్థులు ట్యాబ్‌లను రోజూ వినియోగించడంతోపాటు సబ్జెక్టుల వారిగా సాధనా కార్యక్రమాన్ని అమలు చేయాలని చెప్పారు. బైజూస్ కంటెంట్‌ను తక్కువగా ఉపయోగిస్తున్నట్లు ఆమె గమనించారు. ఉపాధ్యాయులు బైజూస్ కంటెంట్ వినియోగం విషయంలో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పదో తరగతి విద్యార్థుల నోట్సులను ఎప్పటికప్పుడు దిద్దాలని తప్పులను సరిచేసి సరైన జవాబులను వారితో రాయించాలన్నారు. ఉపాధ్యాయుల పాఠ్యప్రణాళిక పత్రాలను, డైరీలు, ఇతర ప్రగతి నివేదికలను పరిశీలించారు. హెచ్‌ఎం నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో బాలికల సత్తా


గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటరమణ, అధ్యాపకులతో ఉద్యోగాలు సాధించిన విద్యార్థినులు

మురళీనగర్: క్యాంపస్ ఇంటర్వ్యూల్లో కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కళాశాల (గైస్) బాలికలు సత్తా చాటారు. ఇటీవల నెట్టూర్ టెక్నికల్ ఫౌండేషన్ (ఎన్‌టీటీఎఫ్) నిర్వహించిన ఆఫ్ క్యాంపస్ ఇంటర్వ్యూలకు ఈ కళాశాల నుంచి వెళ్లిన విద్యార్థులు రాత పరీక్ష, మౌఖిక పరీక్షల్లో ప్రతిభను చాటుకున్నారు. వీరిలో 13 మంది బాలికలు నెలకు రూ.18,000ల ప్యాకేజీతో రీసైక్లింగ్ టెక్నీషియన్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కెమికల్ నుంచి ఆరుగురు, పెట్రోకెమికల్ నుంచి ఐదుగురు, ప్లాస్టిక్ అండ్ పాలిమర్స్, ఆయిల్ టెక్నాలజీ విభాగాల నుంచి ఒక్కొరు చొప్పున ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ, కెమికల్ ఇంజినీరింగ్ హెడ్ డాక్టర్ బీవీ లక్ష్మణరావు, ఇతర డిపార్టుమెంటు హెడ్‌లు, అధ్యాపకులు మంగళవారం వీరిని అభినందించారు.

రెండు గ్రంథాల ఆవిష్కరణ


లలితాపీఠంలో గ్రంథావిష్కరణ చేస్తున్న వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి, సర్వేశ్వర ప్రసాద్

సీతంపేట: విశాఖ సాహితి ఆధ్వర్యంలో లలితాపీఠంలో ఉపాధ్యాయుల గౌరీ శంకరరావు రచించిన రెండు గ్రంథాలను ఆవిష్కరించారు. విశాఖ సాహితి ఉపాధ్యక్షుడు కందాళ కనకమహాలక్ష్మి అధ్యక్షత వహించగా, ఆచార్య వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి ముఖ్య అతిథిగా ' శ్రీరామ కథా మకరందము, బాలకాండ' గ్రంథాన్ని ఆవిష్కరించారు. ప్రసన్న భారతి సంపాదకులు కొండేపూడి సర్వేశ్వర ప్రసాద్ 'సోహం' గ్రంథాన్ని ఆవిష్కరించారు. శ్రీరామ కథా మకరందాన్ని జయంతి వెంకట సూర్యనారాయణ మూర్తి సమీక్షించగా, డీవీ సూర్యారావు సోహం గ్రంథాన్ని సమీక్షించారు. గ్రంథ రచయిత గౌరీ శంకరరావు చందో కవిత్వంలో చేసిన కృషిని, కవిత్వంలోని సొబగులను సమీక్షించారు. గ్రంథకర్త శంకరరావు మాట్లాడుతూ విశాఖ సాహితి వేదికగా పెద్దల సమక్షంలో రెండు గ్రంథాలను ఆవిష్కరణ జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ సాహితి కార్యదర్శి ఘండికోట విశ్వనాథం, పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ


సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ శాంతి

కంచరపాలెం: జీవీఎంసీ 47వ వార్డు కంచరపాలెం కప్పరాడ వైఎస్సార్ ప్రజా ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రాజేంద్ర ఆధ్వర్యంలో మంగళవారం క్యాన్సర్‌పై అవగాహన కలపించారు. ఈ సందర్భంగా సైకిల్ ర్యాలీ నిర్వహించారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ పి.శాంతి ర్యాలీని ప్రారంభించారు. క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా ర్యాలీ చేపట్టినట్లు తెలిపారు. ఖైనీ, గుట్కా పొగాకు ఉత్పత్తులు నమలడం వలన వచ్చే దుష్ఫలితాలను వివరించారు. కార్యక్రమంలో యూపీహెచ్‌సీ వైద్యసిబ్బంది , ఎఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అలరించిన స్వర సంగమం


జ్యోతిప్రజ్వలన చేస్తున్న అతిథులు

సీతంపేట: శారదా స్వర సంగమం ఆధ్వర్యంలో ప్రముఖ దర్శకుడు పద్మశ్రీ కె.విశ్వనాథ్, పద్మ భూషణ్ వాణీజయరామ్‌లకు స్వర నివాళి అర్పించారు. విశాఖ పౌర గ్రంథాలయంలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన కార్యక్రమాన్ని సోషల్ మీడియా స్టేట్ చైర్మన్ సన్‌మూర్తి, దూరదర్శన్ మాజీ డైరెక్టర్ పీజే సుధాకర్, ఆచార్యులు రాజేంద్రప్రసాద్, లోకేష్, చెన్నా తిరుమలరావు తదితరులు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా కె.విశ్వనాథ్, వాణీ జయరామ్ చిత్రపటాలకు నివాళులు అర్పించారు. గాయనీ గాయకులు లోకేష్, లక్ష్మీ స్వరూప, లక్ష్మీసాత్విక, శ్రీగిరి, శైలజ కుమారి, వెంకటేష్, నాయుడు, నాగలక్ష్మి, కె.ఎల్.రావు, శ్రీదేవి, కవిత, సుజని, శ్వేత, దుర్గాప్రసన్న, లక్ష్మణ్ పలు హిట్ సాంగ్స్‌ను ఆలపించి ప్రేక్షకులను అలరించారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

ఆరిలోవ: రోడ్డు ప్రమాదానికి గురైన ఓ గుర్తు తెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆరిలోవ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సుమారు 60 సంవత్సరాలు వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి ఈ నెల 5న జాతీయ రహదారిపై జూ పార్కు సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. తీవ్ర గాయాలుపాలైన ఆయనను ఆరిలోవ పోలీసులు చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన ఈ నెల 12న రాత్రి మృతి చెందాడు. అప్పటి నుంచి అతని మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచారు. ఆయన బంధువులు ఎవరైనా ఉంటే ఆరిలోవ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు కోరుతున్నారు. చికిత్స పొందుతున్న సమయంలో ఆయన పేరు గురుమూర్తి సాహు అని చెప్పినట్టు పోలీసులు తెలిపారు. పూర్తి అడ్రస్ మాత్రం చెప్పలేకపోయాడన్నారు. దీంతో గుర్తు తెలియని వ్యక్తి మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ బి.అనిల్‌కుమార్ తెలిపారు.

మహా శివరాత్రికి ఆలయాల ముస్తాబు


ధర్మానగర్‌లో ముఖద్వారాన్ని ముస్తాబు చేస్తున్న దృశ్యం


రంగులు దిద్దుకుంటున్న జ్ఞానాపురం విఘ్నేశ్వర పార్వతీశ్వరాలయం

కంచరపాలెం: ఈ నెల 18న మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శివాలయాలు ముస్తాబవుతున్నాయి. కంచరపాలెం పరిధిలో గౌరీ శంకరాలయం, యల్లబిల్లివారి గౌరీ శంకర పంచాయతన ఆలయం, తిక్కవానిపాలెం అన్నపూర్ణ విశ్వేశ్వరాలయం , ఇందిరానగర్‌లో లక్ష్మీగణపతి ఈశ్వరాలయం, రామ్మూర్తిపంతులుపేట రామలింగేశ్వరాలయం, సాంబమూర్తినగర్ కాలనీలో అన్నపూర్ణ ఆలయం, 104 ఏరియా బాపూజీనగర్ శివాలయం, ధర్మానగర్ బీవన్‌టీవన్ కాలనీలో హేరంబ కోదండ ఉమ మహేశ్వరాలయం,జ్ఞానాపురం విఘ్నేశ్వర పార్వతీశ్వరాలయం తదితర ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా శివ పార్వతుల కల్యాణోత్సవం, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, రుద్రహోమం, అర్చనలు, రజిత బిల్వార్చన, పూర్ణాహుతి, శతరుద్రాభిషేకం తదితర పూజా కార్యక్రమాలు జరగనున్నాయి. ఉపవాసం, జాగరణ, కోసం ఆలయ కమిటీ నిర్వాహకులు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే రంగులతో ఆలయ గోపురాలు కళకళలాడుతున్నాయి. ఆయా ఆలయాలకు విద్యుత్ దీపాలతో అందంగా అలంకరిస్తున్నారు. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆ రోజు అర్ధరాత్రి 12 గంటలకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించనున్నారు. ఆలయాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

కారాగారంలో తాజా కూరగాయలు


పొలంలో ముల్లంగి తీసి శుభ్రం చేస్తున్న ఓపెన్ ఎయిర్ ఖైదీ


జైలు ఆవరణలో క్యాబేజీ, టమాటా పంటలు

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారంలో ఓపెన్ ఎయిర్ ఖైదీలు పండించే తాజా కూరగాయలు విక్రయానికి సిద్ధంగా ఉన్నాయి. ప్రస్తుతం ముల్లంగి, క్యాబేజీ, టమటా, దోస, ఆనబ, తదితర కూరగాయలను జైలు గేటు ముందు సుమారు నాలుగు ఎకరాలలో పండిస్తున్నారు. వీటి సాగులో ఎలాంటి రసాయనాలు వాడకుండా సేంద్రియ ఎరువులు వినియోగిస్తున్నారు. నిత్యం ఇక్కడ కాలానుగుణంగా కూరగాయల పంటల సాగు చేపడుతున్నారు. ఈ కూరగాయలను ఖైదీల భోజనాలకు వినియోగిస్తారు. ఇంకా మిగిలిన కూరగాయలను బయట విక్రయానికి అందుబాటులో ఉంచుతున్నారు. ముల్లంగి, క్యాబేజీ తదితర ఉత్పత్తులను బీఆర్‌టీఎస్ ఆనుకుని జైల్ ప్రధాన ద్వారం వద్ద నిర్వహిస్తున్న సుధార్ కేంద్రంలో విక్రయానికి పెట్టారు. ఈ కేంద్రంలో జైలులో ఖైదీలు తయారు చేసే కేకులు, బిస్కెట్లు, తువ్వాళ్లు, మ్యాటీలు, తదితర వాటిని కూడా విక్రయిస్తున్నారు. రసాయనాలు లేని కూరగాయలు, తాజా, రుచితో కూడినవి కావడంతో ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది.



వీఎంఎస్‌ను కచ్చితంగా పాటించాలి


మాట్లాడుతున్న క్రైం సీఐ ఇమ్మాన్యుయేల్ రాజు

సీతంపేట: నగరంలో జీ20 సదస్సు జరగనున్న నేపథ్యంలో హోటల్స్, లాడ్జీల యాజమాన్యాలు విజిటర్స్ మానిటరింగ్ సిస్టం (వీఎంఎస్)ను కచ్చితంగా పాటించాలని క్రైం సీఐ టి.ఇమ్మాన్యుయేల్ రాజు అన్నారు. ద్వారకా, ఎంవీపీ స్టేషన్‌ల ఎస్‌ఐలు బి.నిహార్, కె.సురేష్‌ల ఆధ్వర్యంలో స్థానిక రామాటాకీస్ వద్ద ఓ ఫంక్షన్ హాల్లో హోటల్, లాడ్జీల యాజమానులు, మేనేజర్స్‌కు వీఎంఎస్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే నెల జీ20 సదస్సు జరగనున్న నేపథ్యంలో వివిధ రాష్ట్రాలు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారు నగరంలో హోటల్స్, లాడ్జీలలో బస చేస్తారన్నారు. వారి ఆధార్, ఫోన్ నంబరు, చిరునామా వంటి పూర్తి వివరాలు ఏఎంఎస్‌లో అప్‌లోడ్ చెయ్యాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐ సత్యనారాయణ, హెచ్‌సీలు జె.ఎం.ఎం. రెడ్డి, ఎన్. షాదాబ్స్, రమేష్ పాల్గొన్నారు.

నైతిక విలువలు అంతర్భాగం కావాలి

ఏయూ క్యాంపస్: నైతికత, విలువలు విద్యార్థి దశ నుంచి మనలో భాగం కావాలని ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత అన్నారు. బీచ్ రోడ్డులోని ఏయూ యోగా విలేజ్‌లో నిర్వహించిన ఫ్రెషర్స్‌డే వేడుకల్లో ఆమె ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా యోగా విద్యకు ప్రాముఖ్యత, ప్రాచుర్యం పెరుగుతోందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని మెరుగైన సామర్థ్యాలను పొందే ప్రయత్నం చేయాలన్నారు. కాలాన్ని గౌరవిస్తూ, క్రమ శిక్షణ పాటిస్తూ విద్యాభ్యాసాన్ని పూర్తి చేయాలన్నారు. ఆర్ట్స్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు మాట్లాడుతూ ధ్యానం మానవ జీవితంపై ఎంతో ప్రభావం చూపుతుందన్నారు. ఈ సందర్భంగా ఎంఏ యోగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

మహిళా కళాశాలలో అమర వీరులకు శ్రద్ధాంజలి


కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పిస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

దాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం పుల్వామా అటాక్ ను స్మరిస్తూ అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించే కార్యక్రమం నిర్వహించారు. వారి సంస్మరణార్థం కొవ్వొత్తులు వెలిగించి ర్యాలీ జరిపారు. కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శోభారాణి మాట్లాడారు. విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందిచాలని ఈ కార్యక్రమం ద్వారా అమర వీరులకు నివాళులు అందించామన్నారు. కార్యక్రమంలో కళాశాల ఎన్‌సీసీ కో ఆర్డినేటర్ డాక్టర్ కె. గీతాంజలి, కళాశాల అకడమిక్ గైడెన్స్ ఆఫీసర్ డాక్టర్ కె.సుధ, విద్యార్థినులు పాల్గొన్నారు.